క్లుప్తంగా

నేడు వలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూలు

జియ్యమ్మవలస: మండలంలోని వివిధ గ్రామాలలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రమేష్ తెలిపారు. బాసంగి, గవరమ్మపేట, జియ్యమ్మవలస, కుదమ, పెదతోలుమండ, అంకవరం గ్రామాలలో వివిధ కారణాలతో ఖాళీ అయిన వాటికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీరఘట్టం: పాలకొండ – వీరఘట్టం 33 కేవీ విద్యుత్ లైన్‌లో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నందున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వీరఘట్టం ఏఈ బాలాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవగాం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వీరఘట్టం, పాలకొండ మండలాల్లో బొడ్లపాడు, తెట్టంగి, నవగాం ఫీడర్ల పరిధిలో ఉన్న 22 పంచాయతీలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కొండాపురంలో ఫ్యామిలీ డాక్టర్


వైద్య సేవలు అందిస్తున్న కమలనాథ్

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 78మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్‌ఎం కుమారి, ఆర్.శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు సేవలు అందించారు.

ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ పరిశీలన


ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జీసీసీ విజిలెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్‌ను జీసీసీ విజిలెన్స్ ఆఫీసర్ ఎం.వి.రమణ, జీసీసీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ డి.ఎస్.నాయుడు ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. దీంతో పాటు వారు డీఆర్‌ఎస్, గ్యాస్ గొడాం, పెట్రోల్ బంకులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా సరుకుల నిల్వలు, సరఫరాలకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. వీరి వెంట జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తదితరులున్నారు.

రచ్చ బండ ప్రారంభం


రచ్చబండను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: దేవనాపురంలో నూతనంగా నిర్మించిన రచ్చబండను పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశాలకు దీన్ని వినియోగించుకోవాలన్నారు. రచ్చబండ పక్కన ఒక గది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, కె.సరస్వతి, సర్పంచ్‌లు మౌనిక, తిరుపతిరావు, ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కె.సత్యం పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

భామిని: మండలంలోని సొలికిరిలో గురువారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ప్రతీ విద్యుత్తు స్తంభం వద్ద వీధి దీపాలను తనిఖీ చేయించి కొత్త లైట్లు వేశారు. వేసవి కాలంలో ఆరు బయట వెలుతురు ఉండాలనే ధ్యేయంతో స్ట్రీట్ లైట్లు వేయించినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో సిబ్బంది సహకరించారు.

మలేరియాపై చైతన్యపరచాలి

కురుపాం: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్య సిబ్బంది చైతన్య పరచాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి ఎ.శ్యామ్ సూచించారు. మండలంలోని నీలకంఠాపురం పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా గురువారం సందర్శించారు.

సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి
- తాలాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారులకు నవరత్నాల కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: జన రంజకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు వేయడం జరుగుతుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. చిన్నరామ, దేవనాపురం, లక్కాయిగూడ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలతో పాటు సమాజంలో అభివృద్ధి చూపారన్నారు. పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ హాయంలో సంక్షేమ పథకాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో వేలాది కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకుని ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా పథకాలు అమలు చేశారన్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. దేవనాపురంలో విద్యుత్ స్తంభాలు మార్చాలని గిరిజనులు కోరారు. అలాగే చిన్నరామలో కూడా భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇంకా మరికొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీలు ఎం.విజయలక్ష్మి, కె.సరస్వతి, సర్పంచ్‌లు సవర మౌనిక, తిరుపతిరావు, ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కె.సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్, హౌసింగ్ ఏఈ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎం.రామారావు, ఎన్.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటా సంక్షేమమే లక్ష్యం


అచ్చబలో బుక్‌లెట్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ ఇంటా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని చినగీసాడ గ్రామ సచివాలయం పరిధిలోని పుసాబడి, అచ్చబ, నోంద్రుకోన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఆయా గ్రామాల్లోని గడప గడపకు వెళ్లి ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియపరుస్తూ, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థతో ముఖ్యమంత్రి ప్రభుత్వ పాలనను మరింత చేరువ చేశారన్నారు. అన్ని వర్గాలకు పారదర్శకంగా, పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని స్పష్టం చేశారు. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం ప్రతీ గడపకు సంక్షేమాన్ని చేరవేసిందని, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చేసిన లబ్ధిని గుర్తుంచి మళ్లీ మద్దతునందించాలన్నారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, చినగీసాడ సర్పంచ్ ఎస్.శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్ రాజు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జంపర కోట రిజర్వాయర్‌ను పరిశీలించిన పీఓ


జంపరకోట రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీఓ

పాలకొండ: మండలంలోని జంపరకోట రిజర్వాయర్‌ను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితిపై జల వనరుల శాఖ అధికారులను ప్రశ్నించారు. ఇంతవరకు రిజర్వాయర్ కోసం ఎంత నిధులు ఖర్చు చేశారు, ఇంకా ఎంత మొత్తం అవసరం ఉంటుంది తదితర అంశాలపై పీఓ ఆరా తీశారు. రిజర్వాయర్ ఆయకట్టు, ప్రస్తుతం ఆయకట్టు పరిస్థితి తదితర అంశాలను ఆయకట్టు రైతులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ పి. సోమేశ్వరరావు, నీటి పారుదల శాఖ అధికారులు ఉన్నారు.

అద్దెకు జీసీసీ దుకాణాలు

సీతంపేట: స్థానిక హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న జీసీసీ నూతనంగా నిర్మించిన దుకాణాలు గిరిజనులకు అద్దెకు ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్ విల్ 2, 3, 4, 5, 7, 8 నంబర్ గల దుకాణాలు ఒక్కో దానికి రూ.లక్షా 50 వేలు డిపాజిట్, నెలసరి అద్దె రూ.5 వేలుగా నిర్ణయించడమైందన్నారు. షాపు నంబర్ 6, 9లకు రూ.లక్ష డిపాజిట్, నెలసరి అద్దె రూ.4 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిపాజిట్ సొమ్ము ఏదైనా నేషనల్ బ్యాంకులో డివిజనల్ మేనేజర్ జీసీసీ పేరు మీద డీడీ తీసుకోవాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జత చేసి వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మే 10 ఉదయం 11 గంటలకు పరిశీలించనున్నామన్నారు. వివరాలకు జీసీసీ డీఎం క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి : పీడీ


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

కురుపాం: నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం వెంకట కిశోర్ ఆధ్వర్యంలో మండల సమాఖ్యలోని వీఓఏలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడుతూ 2023 - 24 సంవత్సరాలకు సంస్థాగత నిర్మాణం, స్త్రీనిధి కొత్త రుణాలు, రికవరీలు, ఉన్నతి కొత్త రుణాలు, ఉన్నతి రికవరి, వైఎస్సార్ ఆసరా, చేయూత, పథకాలకు, మహిళా మార్ట్, స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొని మండల సమాఖ్యను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. సమావేశంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, అప్పారావు, టీపీయంయు ఏపీఎం జయమ్మ, భారతి, వీఓఏలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వీఆర్‌ఏల వినతి


ఎమ్మెల్యే కళావతికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

వీరఘట్టం: తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఓల సంఘం సభ్యులు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కలిశారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతిని గురువారం కలిసిన వారు తమ సమస్యలను వివరించి వినతిపత్రం ఇచ్చారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నాడు - నేడు పనుల పరిశీలన


బాలుర జూనియర్ కళాశాలలో నాడు - నేడు పనులపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ: నగర పంచాయతీలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. బాలుర, బాలికల కళాశాలల్లో రూ.2 కోట్లతో జరుగుతున్న ఈ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కళాశాలలకు చెందిన స్థలం ఆక్రమణలపై ప్రిన్సిపాల్ మాచర్ల కుమారస్వామిని ప్రశ్నించారు. విద్యార్థులకు శుద్ధ జలం కోసం రూ.5 లక్షల నిధులతో ఆర్.ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ సోమేశ్వరరావు ఉన్నారు.

అటవీ ఉత్పత్తుల రవాణాకు అనుమతి తప్పనిసరి

సీతంపేట: కలపేతర అటవీ ఉత్పత్తుల రవాణాకు గ్రామ సభ అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం పట్టాలు పొందిన ప్రాంతంలో ఉత్పత్తి అయిన కలపేతర అటవీ ఉత్పత్తులపై యాజమాన్యపు హక్కులు సంబంధిత లబ్ధిదారులకు సెక్షన్ 3(1) సీ ప్రకారం దఖలు పర్చడమైందన్నారు. కొండచీపుర్లు తదితర ఉత్పత్తులకు రవాణా అనుమతి మంజూరు అధికారం గ్రామ సభలకు నియమించబడిన కమిటీకి లేదా గ్రామసభచే నియమించబడిన అధీకృత వ్యక్తికి ఉంటుందని పేర్కొన్నారు.

సమయపాలన తప్పనిసరి


నేరడి-బి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

భామిని: మండలంలోని నేరడి – బి, నులకజోడు, బురుజోల గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు గురువారం సందర్శించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతీ రోజూ విధిగా సమయ పాలన పాటించాలని సూచించారు. కలెక్టర్ సచివాలయాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. నేరడి – బి సచివాలయంలో జరుగుతున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడారు. బురుజోల సచివాలయంలో విధులకు హాజరు కాని ఉద్యోగుల వివరాలు గుర్తించారు. స్థానికులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు.

కార్మిక హక్కుల దినం మేడే


మేడే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: ప్రైవేటీకరణ సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకొన్న హక్కులపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు దావాల రమణారావు గురువారం అన్నారు. పాలకొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పోరాటాలతో సాధించుకొన్న కార్మిక హక్కుల దినంగా మేడేను జరుపుకొందామని పిలుపునిచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు బి.అమరవేణి, కార్యదర్శి కాద రాము, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పాలకొండ: నగర పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీలోని పలు వార్డుల్లో గురువారం పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడేందుకు సిబ్బందికి సూచనలు అందించామని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ విధిగా చేపడుతున్నామని వివరించారు. ప్రజలు రహదారులు, కాలువల్లో చెత్త వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తెలిపారు.

సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

పాలకొండ రూరల్: ఉపాధి పనులు చేపడుతున్న చోట వేతనదారులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ఫీల్డ్ సిబ్బంది దృష్టి పెట్టాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని నవగాం గ్రామంలో వీరసాగరం చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఎం.సింగుపురం, జంపరకోట గ్రామాల్లో చేపడుతున్న పనులపై క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. వేతనదారుల హాజరు నమోదు సక్రమంగా చేపట్టాలన్నారు.

శాంతి సమాధాన పండుగలకు హాజరైన ఎమ్మెల్యే


శాంతి సమాధాన పండుగల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాతుగుడబ గ్రామంలోని బెయోర్లైబా చర్చి మైదానం వద్ద ఇండియన్ ఇవాంజికల్ టీమ్ (ఐఈటీ) ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జరుగుతున్న శాంతి సమాధాన పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐఈటీ కోఆర్డినేటర్ రెవరెన్.వెన్నా విజయ్ కుమార్ యేసు క్రీస్తు సమాజానికి అందించిన సందేశాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక తదితరులకు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాటివారికి సాధ్యమైనంత మేరకు సాయమందించడమే నిజమైన సేవని అన్నారు.

నాడు – నేడు పనులు వేగవంతం చేయాలి


రావివలస ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: నాడు – నేడు రెండవ విడత పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని రావివలసలో కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను, మధ్యాహ్న భోజన పథక నిర్వాహణను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు – నేడు రెండవ విడతలో 31 పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని కాంట్రాక్టర్‌కు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలోని చిలకాం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహణను ఆయన పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

నూకాలమ్మా.. చల్లంగా చూడమ్మా..


నూకాలమ్మ చిన్న పాప, పెద్దపాపలకు పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనూకాలమ్మ చిన్నపాప, పెద్దపాప పండుగను గ్రామప్రజలు భక్తి శ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఊరికి తూర్పున ఉన్న నూకాలమ్మ చింత చెట్టు వద్ద చిన్నపాప, పెద్దపాప (చెక్క విగ్రహాలు) లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారి సేవకుల్లో ఒకరైన రజకులు ఈ పండుగను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. తొలుత వీరు ఈ విగ్రహాలను తయారుచేసిన బూరాడ చిన్న ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి నూకాలమ్మ చింతచెట్టు వద్ద ప్రతిష్ఠించి ముర్రాటలు(పసుపు నీరు) చల్లి, అమ్మా....నూకాలమ్మా... చల్లంగా చూడమ్మా అంటూ తొలి పూజలు నిర్వహించారు. తర్వాత సర్పంచ్ పులిటి గౌరమ్మ పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుండి మహిళలు కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేసారు. భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. అంతకు ముందు బోయిడు ఇంటి నుండి బయలుదేరిన పాలజంగిడిని భక్తులు పలు వీధుల్లో తిప్పారు.

వలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూ


సీతంపేట: వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ సత్యం

సీతంపేట: మండలంలోని నాలుగు గ్రామ వలంటీర్ పోస్టులకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యం ఆధ్వర్యంలో కుశిమి, కిరప, చిన్నపల్లంకి, కిండంగి పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిపారు. పరిపాలనాధికారి మాస తదితరులు పాల్గొన్నారు.

కొమరాడలో..

కొమరాడ: మండలంలోని ఉలిపిరి, చోళ్లపధం, కెమిశీల, పరుశురాంపురం, శివిని, విక్రంపురం, పెదశాఖ, కంబవలసలో మొత్తం ఎనిమిది వలంటీర్ల పోస్టులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎల్వీ అప్పారావు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 14 మంది దరఖాస్తు చేసుకోగా 11 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా ఎనిమిది మందిని ఎంపిక చేస్తామని తెలిపారు.

రెండు పూటలు 'ఉపాధి'లో పాల్గొనాలి


ఉల్లిబద్రలో వేతనదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ గోపాలరావు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులు రెండు పూటల పాల్గొనాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిబద్ర పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి హామీ పథకం ఇంజినీరింగ్ అధికారులు ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. రోజుకు కనీసం రూ.250లు వచ్చేలా పనులు చేపట్టాలన్నారు.

జన నినాదం.. 'జగనన్నే మా భవిష్యత్తు'

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాని, భవిష్యత్తులో మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పలువురు పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం ప్రజా మద్దతుతో ఉత్సాహంగా పలుచోట్ల జరిగింది. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. – సాక్షి నెట్‌వర్క్


పాలకొండ : నగర పంచాయతీలోని 2వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


సీతంపేట: చిన్నరామలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కళావతి తదితరులు


భామిని: బత్తిలిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సర్పంచ్ టింగ శాంతికుమారి తదితరులు